క్లుప్తంగా

వైభవంగా అంకాలమ్మ తల్లి తిరునాళ్ల



దాసళ్లపల్లిలో అంకాలమ్మ తల్లికి ఏర్పాటు చేసిన కుంకుమ బండ్లు

హనుమంతునిపాడు: మండల పరిధి దాసళ్లపల్లి గ్రామ సమీపాన దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాలమ్మ తల్లికి ప్రత్యే పొంగళ్లు, కుంకమ బండ్లు ఏర్పాటు, కొర్లబండి ఉత్సాహం వైభవంగా నిర్వహించారు. దసళ్లపల్లి, చిన్నదాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు గ్రామస్తులు ఏర్పాటుచేసిన కుంకమ బండ్లు మేళతాలు సందడితో గ్రామోత్సం నిర్వహించారు. భక్తులు దేవస్థానం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి, ఏడో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.అరుణ సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కొండపి(సింగరాయకొండ): మండలంలోని పెట్లూరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు ఏఓ డి.విజయ్ కుమార్ తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర సాగు చేస్తే నేల సారవంతం అవుతుందన్నారు. ఈ సీజన్‌లో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో జనుములు 100 క్వింటాళ్లు, పిల్లిపెసర 5 క్వింటాళ్లు రైతులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ పద్మ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సింగరాయకొండ: జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈదుమూడిలో నిర్వహించనున్న జనజాతర సభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ రావి నూతల కోటిమాదిగ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి రేణుమాల మాధవ్, మోజెస్, వెంకటేష్, శ్యాం, శివ తదితరులు పాల్గొన్నారు.

47 మందికి వైద్య పరీక్షలు

టంగుటూరు: స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సోమవారం 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 15వ తేదీ వరకు జిరియాటిక్ క్యాంపులు నిర్వహించి 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు, వైద్య సలహాలు అందజేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురుకులానికి 80 సీట్లు మంజూరు

సింగరాయకొండ: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీకి 40 సీట్లు, బైపీసీకి 40 సీట్లు మంజూరైనట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ డి.జయ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ సీట్లు వినియోగంలోకి వస్తాయన్నారు. ప్రస్తుతం కాలేజీలో సీఈసీ గ్రూప్‌నకు 80 సీట్లు ఉండగా, ప్రభుత్వం అదనంగా మరో 80 సీట్లు మంజూరు చేసిందని వివరించారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఆధారంగా సీట్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

● ఇద్దరికి రూ.75 వేలు జరిమానా

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం సతుకుపాడు ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్ తన సిబ్బందితో సోమవారం తెల్లవారుజామున దాడి చేశారు. ఒంగోలు మండలం వెంగముక్కలపాలేనికి చెందిన జేసీబీ డ్రైవర్ కె.రవికి రూ.50 వేలు, కనిగిరికి చెందిన టిప్పర్ డ్రైవర్ కొణిదెల శ్యాంకు రూ.25 వేలు జరిమానా విధించారు. ఎస్సై దయాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరిమానా మాత్రమే విధించామని, మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి



నేను బడికి పోతా కార్యక్రమంలో సీడీపీఓ సరోజిని



పామూరు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పామూరు: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం ఎం రామస్వామి అన్నారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్ఎం రామస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక పాఠశాల వద్ద నుంచి ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలకు పంపాలన్నారు. ఉన్నతవిద్య మనం మన పిల్లలకు, భావితరాలకు ఇచ్చే ఆస్తి అన్నారు. ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: గ్రామంలోని చిన్నారులంతా తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలో ఉండాలని సీడీపీఓ కె.సరోజిని అన్నారు. మండలంలోని చాకిరాల గ్రామంలో సోమవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కేంద్రాల్లో ప్రభుత్వం అందచేసే పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థుల మానసిక స్థాయికి అనుగుణంగా ఆట పాటల ద్వారా విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, కార్యకర్తలు దీపిక, మాధవి, జ్యోతి, జరీనా, జిలేఖ, సౌభాగ్యమ్మ పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలలో చేరండి.దాతల సాయంతో రవాణవసతి కల్పిస్తామని మండలంలోని చెన్నపునాయునిపల్లి ఎంపీయూపీ హెచ్ఎం, ఉపాధ్యాయులు అన్నారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని చెన్నపునాయునిపల్లి ప్రాథమికోన్నతపాఠశాల హెచ్ఎం చాంద్‌బాషా, ఉపాధ్యాయులు అటవీ ప్రాంతంలోని మైలుచర్లలో విద్యాప్రవేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఇంటింటికి వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించారు. మీ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, మా సొంత ఖర్చులు, దాతల సాయంతో రెండుపూటలా వాహనాలు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా గత ఏడాది కూడా దాతల సాయంతో వ్యాన్ సౌకర్యం కల్పించగా మైలుచర్ల విద్యార్థులు చెన్నపునాయునిపల్లి పాఠశాలకు విద్యాభ్యాసానికి వచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షరీఫ్, దుర్గ, మాధవి, మల్లీశ్వరి, గ్రామస్తులు ఉన్నారు.



మైలుచర్లలో క్యాంపెయినింగ్ నిర్వహిస్తున్న హెచ్‌యం, ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

టంగుటూరు: బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ 2 తన్నీరు బాలాజీ సూచించారు. మండలంలోని వెలగపూడి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ చెంచు పున్నయ్య అధ్యక్షతన తల్లితండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 6 నుంచి 14 ఏళ్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం మస్తాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ షమీమా, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గుడ్లూరు: మండలంలోని నరసాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాత రైతన్న ఫౌండేషన్ చైర్మన్ చెరుకూరు బంగారయ్య అందచేసిన నోట్ పుస్తకాలు, పలకలు, స్టేషనరీని ఎంఈఓ–2 గోవర్ధన్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నరసాపురం గ్రామానికి చెందిన బంగారయ్య ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తన ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తుండటం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి దాతల సహకారం ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించాలన్నారు. అనంతరం నరసాపురం ప్రాథమికోన్నత, ప్రాథమిక, నాయుడుపాలెం, ముత్తంవారిపాలెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లోని 150 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీలు అందచేశారు. దాత బంగారయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, మల్లికార్జున, ఉషారాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



టంగుటూరు: మాట్లాడుతున్న ఎంఈఓలు చెంచుపున్నయ్య, బాలాజీ



నరసాపురంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పలకలు అందచేస్తున్న ఎంఈఓ



వెలగపూడిలో విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న దాతలు

విద్యా సామగ్రి కిట్లు పంపిణీ

టంగుటూరు: మండలంలోని వెలగపూడి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సరోజా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చిడిపోతు వెంకటేశ్వర్లు, కోటపాటి వెంకటేశ్వర్లు నోటు పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, పెన్సిళ్లు, ఇతర విద్యా సామగ్రి కిట్లను సోమవారం అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లితండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎంఈఓలు చెంచుపున్నయ్య, బాలాజీ, హెచ్ఎం మస్తాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ షమీమా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యాప్రవేశం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని డీజీపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను, ప్రాథమిక, ఎస్సీకాలనీ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి క్రమం తప్పకుండా మెనూ అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు నూరుశాతం బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. 5వ తరగతి పూర్తయిన ప్రతి విద్యార్థి 6వ తరగతిలో చేరేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యా ప్రవేశం పేరుతో జూన్ 24వ తేదీ నుంచి జూలై 25వ తేదీవరకు నెలరోజులపాటు ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. స్టూడెంట్స్‌కిట్స్ పంపిణీ త్వరితగతిన పూర్తిచేయాలని, విద్యాభివృద్ధికోసం ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం జి.వెంకటేశ్వర్లు, ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.



డీజీపేట జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి

టంగుటూరు: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని, అదేవిధంగా నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. రైతులు, కూలీలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. రైతులు, కౌలు రైతులకు రైతు భరోసా కెంద్రంలో జనుము, జీలుగు విత్తనాలే ఉంచారని అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పట్టాదారులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేయాలని, అదే విధంగా ఉపాధి హామీ పథకానికి 150 నుంచి 200 రోజులకు పెంచి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని గుండ్లకమ్మ, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా నాయకులు మంజుల, వెంకట్రావు, రంగారావు, చక్రవర్తి, సిసింద్రి బాబు తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందిస్తున్న ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.341

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో గరిష్ట ధర కేజీ రూ.341 పలికింది. కె.ఉప్పలపాడు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 1020 బేళ్లు వేలానికి తీసుకురాగా 943 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 77 బేళ్లు తిరస్కరించారు. కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.298.15 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి పొగాకు వేలం కేంద్రంలో సరాసరి ధర కేజీ రూ.305.80 పలికిందని నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలో సోమవారం అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 1,136 బేళ్లు వేలానికి తీసుకురాగా 1,097 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 39 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ.340, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.305.80 పలికింది. వేలంలో 30 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

దాతల సహకారం అభినందనీయం

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సాయం అభినందనీయమని ఎంఈఓ జె.ప్రసాదరావు, సర్పంచ్ వై.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సాయంత్రం పాఠశాల హెచ్ఎం సయ్యద్ ఖాజా రహంతుల్లా అధ్యక్షతన దాతలు సమకూర్చిన నోట్‌పుస్తకాలు, కాపీరైటింగ్ పుస్తకాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన దాత చెరుకుపల్లి వెంకటరెడ్డి సమకూర్చిన నోట్‌పుస్తకాలు, కాపీరైటింగ్ పుస్తకాలను ఎంఈఓ, సర్పంచ్ దాతతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. పాఠశాలల్లోని వసతులను వినియోగించుకుని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి ఇస్తానన్నారు. పీఎంసీ చైర్మన్ గిద్దా ధనలక్ష్మి, ఇసుకపల్లె తిరుపతయ్య, చెరుకుపల్లి రాధారెడ్డి, రహీం, కమ్మనేతి వెంకటేశ్వర్లు, షేక్.నాయబ్‌రసూల్, ఆంథోని, డి.పున్నమ్మ, జె.ఎస్.ఆనంద్‌బాబు, యం.రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉప్పలపాడులో విద్యార్థులకు నోట్స్‌బుక్స్ పంపిణీచేస్తున్న ఎంఈఓ

నారశింహుని హుండీ ఆదాయం రూ.4.16 లక్షలు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ఆలయానికి ఉత్సవాల సందర్భంగా రూ.4,16,347 వచ్చింది. గత సంవత్సరం రూ.3,87,298 వచ్చినట్లు ఆలయ ఈవో పీ కృష్ణవేణి వివరించారు. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తుల రద్దీ బాగా పెరిగిందని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గత అనుభవాల దృష్ట్యా రథోత్సవం రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులందరూ సహకరించారని ఉత్సవాలు సజావుగా జరగటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం హుండీ ఆదాయం పెరగటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. జాళ్లపాలెం ఈవో కొండారెడ్డి, ఉలవపాడు వేణుగోపాలస్వామి దేవస్థానం, మాలకొండ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు



ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌కు అర్జీలు ఇస్తున్న ఫిర్యాదుదారులు



కొండపి : అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిరణ్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ చంద్రమోహన్

కందుకూరు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి ప్రజల నుంచి 12 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ టి.పద్మావతి తెలిపారు. ఈ మేరకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిలో భూఆక్రమణలపై ఒకటి, భూసమస్యలపై రెండు, పోలీస్ శాఖకు 2, విద్యుత్‌శాఖకు ఒకటి, ఇతర సమస్యలు రెండు ఉన్నట్లు తెలిపారు. వీటిని ఆయా శాఖల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారని, ప్రతి సోమవారం జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని వివరించారు.

కందుకూరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఎం చంద్రమోహన్ తెలిపారు. వీటిలో పారిశుధ్యం, రోడ్లు, డ్రైన్లు, ఇతర వ్యక్తిగత సమస్యలు ఉన్నట్లు వివరించారు. ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికకు 4 అర్జీలు వచ్చినట్లు డిప్యూటీ తహశీల్దార్ వీరయ్య తెలిపారు. మొత్తం అన్ని విభాగాలకు చెందిన మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొనగా కేవలం నలుగురు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. నాలుగు అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు తెలిపారు. వీటిని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మీకోసంలో మూడు అర్జీలు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ భవానీశంకర్ తెలిపారు. గత ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన 'స్పందన' కార్యక్రమాన్ని 'మీ కోసం'గా పేరు మార్చినట్లు పేర్కొన్నారు. ఇకపై ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ నాగేష్‌కుమారి, ఏపీఓ సుధాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కిషోర్, హౌసింగ్ ఏఈ నాగరాజు, ఏఓ సుధాకర్, ఏపీఎం డి.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. జరుగుమల్లి రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కేవీఎస్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో డీటీ పి.అరుణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

➤ కొండపి రెవెన్యూ కార్యాలయంలో మీ కోసం కార్యక్రమానికి రెండు అర్జీలు అందాయని తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేయాలి

వెలిగండ్ల: నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 117 జీఓను వెంటనే రద్దు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం యధాతథంగా తీసుకురావాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో బహుజన టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు చేపట్టారు.

జిల్లా నాయకులు పాపాబత్తుని నాగేశ్వరరావు మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం పనిచేసే సంఘం బీటీఏ అన్నారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి గొరిగె రంగారావు, రాష్ట్ర నాయకులు సీహెచ్ చిన్న వెంగయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరిగె లక్ష్మీనారాయణ, కె.రమణ, మల్లెబోయిన రామకృష్ణ, వేమవరపు ఏబేలు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి

హనుమంతునిపాడు: మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పకుండా పాటించాలని ఎంఈఓ ఎస్.రమణయ్య అన్నారు. హనుమంతునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం, కూరలు పరిశీలించి రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం రుచికరంగా వండాలన్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వంటశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు ఆర్థికసాయం



అంగన్‌వాడీ కార్యకర్త సలోమికి నగదు అందజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

వెలిగండ్ల: ఇటీవల ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన మరపగుంట్ల అంగన్‌వాడీ కార్యకర్త గొర్రెముచ్చు సలోమి, ఆమె భర్తకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది ఆర్థికసాయం అందచేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీఎస్‌పురం మండలం అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.21 వేలు, హనుమంతునిపాడు మండలం అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.21,900, సీఎస్‌పురం మండలం అంగన్‌వాడీ కార్యకర్తల లీడర్ సరళ రూ.5 వేలు, ఐసీడీఎస్ ఆఫీసు సిబ్బంది రూ.2100 మొత్తం రూ.50 వేలు గాయపడ్డ గొర్రెముచ్చు సలోమికి అందజేశారు. ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది గంధం సామ్యూల్, రసూల్, కుమారి చాందిని సలోమి ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. తనకు ఆర్థికంగా సహకారం అందజేసిన సెక్టారు లీడర్లు, కార్యకర్తలు, ఆయాలు, ఆఫీసు సిబ్బందికి సలోమి కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణస్వామి ప్రధాన హుండీ ఆదాయం రూ.21.07 లక్షలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ప్రధాన హుండీ ఆదాయం గత 3 నెలల 13 రోజులకు సంబంధించి మొత్తం రూ.21,07,791 వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ తెలిపారు. సోమవారం శ్రీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులు మార్కాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి గోలమారి శ్రీనివాసరెడ్డి, నారాయణస్వామి ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో ప్రధాన హుండీల ఆదాయం లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 మార్చి 11 నుంచి 2024 జూన్ 24వ తేదీ వరకు మొత్తం 3 నెలల 13 రోజుల హుండీ లెక్కించినట్లు తెలిపారు. ప్రధాన హుండీల ద్వారా రూ.20,79,142, అన్నదానం హుండీల ద్వారా రూ.28,649 మొత్తం రూ.21,07,791 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్రావు, అర్చకులు మంకాల సత్యనారాయణ, మంకాల శివప్రసాద్‌శర్మ, స్టేట్‌బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, పోలీసులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.